



ఉప్పురాలలో చౌకధాన్య డిపోలో బియ్యాన్ని తూకం వేస్తున్న డీలర్

అంగన్వాడీల సమ్మెకు సిపిఎం మద్దతు

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తూ క్షేత్ర స్థాయిలో పోరాటాలు చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో కమిటీ సభ్యులతో కలిసి అంగన్‌వాడీ కార్మికులకు మద్దతుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీఉద్యోగులకు వేతనాలు తెలంగాణా కంటె రూ. వెయ్యి అదనంగా ఇస్తానని ఇచ్చిన హామీ నాలుగున్నర సంవత్సరాలుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో వర్కర్‌కు రూ.13,650, మినీ వర్కర్‌కు, హెల్పర్‌కు రూ.7,800 ఇస్తుండగా ఆంధ్రప్రదేశ్ రూ.11,500, రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. వేతనాలపై ప్రజలను తప్పుదారి పట్టించాలన్న దుర్బుద్ధితోనే ప్రభుత్వం అబద్ధపు ప్రచారానికి పూనుకుంటోందని విమర్శించారు. తెలంగాణాలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం రూ.18,000 చేస్తానని వాగ్దానం చేసిన విషయం గుర్తించుకోవాలన్నారు. 'మాట తప్పను మడమ తిప్పను' అని చెప్పే ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలంటే అంగన్‌వాడీల వేతనాలు పెంచాలన్నారు. మానవాభివృద్ధి సూచికలను మెరుగు పర్చడానికి అంగన్‌వాడీల సేవలు తోడ్పడుతున్నాయని తెలిపారు. చంటి పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహార సరఫరా చేస్తూ బాల బాలికలకు ప్రీ స్కూల్ బోధనా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పని చేస్తున్న అంగన్‌వాడీల సేవలను ప్రభుత్వాలు సరిగా గుర్తించడంలేదన్నారు. ఐసిడిఎస్ ప్రారంభం నుంచి అనేక పోరాటాల ద్వారా కార్మికులు వేతనాలు, చట్ట పరమైన సౌకర్యాలు సాధించుకున్నారని గుర్తు చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. టిఎ, డిఎ చెల్లింపులు వంటి కనీస కోర్కెలు అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. కార్మికులు దశలవారీగా అనేక రూపాల్లో ఆందోళనల తరువాత విసిగి చిట్ట చివరకు సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ఈ సమ్మెను నివారించే అవకాశం ఉన్నా ప్రభుత్వం అలా చేయకుండా అబద్ధపు ప్రచారాలకు దిగడం దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలన్నారు. అలా కాదని బెదిరింపు చర్యలకు పాల్పడి సమ్మెను విరమించాలని చూస్తే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల తరగతుల ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజా సంఘాలు అంగన్‌వాడీలకు సంఘీభావంగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు వై.వెంకటనారాయణ, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన రేషన్ డోర్ డెలివరీ

కార్డుదారులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్



రేషన్ షాపు నుంచి బియ్యం తీసుకెళ్తున్న మహిళ

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన రేషన్ డోర్ డెలివరీ కార్యక్రమం మండల పరిధిలోని చాలా గ్రామాల్లో అటకెక్కిందని చెప్పవచ్చు. మండల వ్యాప్తంగా 33 గ్రామాల్లో 40 చౌకధాన్య డిపోల పరిధిలో 20వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా గ్రామాలకు మొత్తం 9 ఎండియు వాహనాలను కేటాయించారు. అయితే స్వల్ప కాలం లోనే వాహనాలకు ఆపరేటర్ లేక తూకాలు వేసే వారికి కూలి గిట్టబాటుకాక ఎక్కడికక్కడ ఎండియు వాహనాల సేవలు ఆగిపోయాయి. దీనికి తోడు చాలా చోట్ల డీలర్లు రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో షాపు వద్దకే వెళ్లి బియ్యం, చక్కెర, కందిబేడలు, తదితర సరుకులు తెచ్చుకుంటున్నామని కార్డుదారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు రేషన్‌షాపునకు వెళ్లి సరుకులు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వాహనాలు కొనుగోలు చేసినా ప్రయోజనం ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో వాహనాలు మరమ్మతులు, డీజిల్ కొరత, కూలీలకు అరకొర వేతనం, అదీ నెల నెలా సక్రమంగా చెల్లించకపోవడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని కొందరు పైలెట్లు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ సరుకులు ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, అలా జరిగితే చర్యలు తీసుకుంటామని దాటవేశారు.

డివైఎఫ్ఐ పోరాటాలకు సంపూర్ణ మద్దతు

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ చేపట్టనున్న ఉద్యమానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆపార్టీ పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య నేతలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో డిగ్రీలు, పీజీలు, డిప్లొమో, ఐటిఐలు చేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. మరికొంతమంది రాష్ట్రంలో పరిశ్రమలు లేక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు అనేక వాగ్దానాలు చేసిన నాయకులు గద్దెనెక్కిన తర్వాత పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ఇందులో ప్రధానంగా మూతబడిన స్పిన్నింగ్ మిల్లు స్థానంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. తర్వాత పట్టించుకోలేదన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పది రోజులుగా సంతకాల సేకరణ చేపట్టడం అభినందనీయమన్నారు. సోమవారం డివైఎఫ్ఐ చేపట్టనున్న ర్యాలీ, ఆర్డీవో కార్యాలయం దగ్గర జరగబోయే ధర్నాకు యువత కదిలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు బి.చంద్రశేఖర్, జాకీర్, ప్రజాసంఘాల నాయకులు సూరి, షాషావలి, ఎస్ఎఫ్ఐ నాయకులు జాకీర్, మోదీరాబాద్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మారినా.. మారని నేమ్ బోర్డులు..

ప్రజాశక్తి-ఉరవకొండ



ఐకెపి కార్యాలయంలో బదిలీ అధికారుల పేర్లు ఉన్న బోర్డు

విడపనకల్లు మండల కేంద్రం లోని ఐకెపి కార్యాలయంలో విధులు నిర్వహి స్తున్న అధికారులు మారినా వారి పేరుమీద ఉన్న బోర్డులు మాత్రం మార్చలేదు. దీంతో ఐకెపి కార్యాలయంలోకి వివిధ పని నిమిత్తం వచ్చే వారు అధికారులు అందుబాటులో లేని సమయంలో అక్కడే ఉన్న నేమ్ బోర్డులో ఫోన్ నెంబర్లకు ఫోన్ చేస్తున్నారు. ఒకవేళ స్పందించినా తాము వేరే మండలానికి బదిలీపై వచ్చామని సమా చారం ఇస్తున్నారు. ఈనేపథ్యంలో ఎవరికి చెప్పాలో అర్థంకాక మండలంలోని ప్రజలు ఇబ్బందులకు ఎదుర్కొ ంటున్నారు. మండల కేంద్రంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఈయనతోపాటు ఉరవకొండ ఏరియా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖలీల్ కూడా రెండేళ్ల క్రితమే బదిలీపై వెళ్లారు. అయినా ఐకెపి కార్యాలయంలో మాత్రం వారి పేర్లతోనే నేమ్ బోర్డులు దర్శనమి స్తుండటం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నేమ్‌బోర్డులో పేర్లు మార్చడం తోపాటు ఫోన్ నెంబర్లు కూడా మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిలమత్తూరు 'పంచాయితీ'

- కార్యదర్శికి, సర్పంచికి మధ్య కోల్డ్‌వార్
- ఉద్దేశపూర్వకంగా కార్మికుల తొలగింపు
- ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్త



దిగువ బస్టాండ్ లో చెత్త పెరిగి మూసుకు పోయిన మురుగుకాలువ



మరవకొత్తపల్లి బీసీ కాలనీలో శుభ్రం చేయక పోవడంతో గడ్డితో మూసుకు పోయిన మురుగు కాలువ

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు పంచాయతీలో సర్పంచి, పంచాయతీ కార్యదర్శికి మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. వీరిద్దరి మధ్య ఏర్పడిన సమన్వయ లోపంతో పంచాయతీ వ్యాప్తంగా సమస్యలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్యం పడకేసింది. సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ఉంటేనే ఆ పంచాయతీ అభివృద్ధి చెందుతుంది. అయితే వీరి సమన్వయ లోపం, వ్యక్తిగత పట్టింపుల వల్ల చిలమత్తూరు పంచాయతీ అభివృద్ధి కుంటుపడింది.

కోల్డ్ వార్ కి కారణం ఏంటి?

నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంలో సర్పంచి గది భవనంలో పై భాగాన ఉంటుంది. క్రింద భవనంలో కార్యదర్శి గది ఉంటుంది. అయితే కార్యదర్శి లేని సమయంలో సర్పంచి సంధ్య కార్యదర్శి గదిలో కూర్చుని ప్రజల సమస్యలు వింటున్నారు. ఆ సమయంలో కార్యాలయానికి వచ్చిన కార్యదర్శి తన సీట్లో సర్పంచి కూర్చోవడం చూసి మండిపడినట్లు సమాచారం. అప్పటి నుంచి వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆ గొడవను మనసులో పెట్టుకొని తాము చేసిన పనులకు సంబందించిన బిల్లులు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అప్పులు చేసి పనులు చేస్తే ఏదో ఒక వంక పెట్టి బిల్లులు ఆపేస్తున్నారని సర్పంచి ఆరోపిస్తున్నారు. దీంతో ఇక వేరే పనులు చేయాలంటే అప్పులు కూడా పుట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. అయితే ఈ తతంగం అంతా మండల స్థాయి అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. వీరిద్దరిని సమన్వయం చేస్తారా లేక వదిలేస్తారో తెలియదు కాని పంచాయతీ పరిస్థితి మాత్రం దీనంగా తయారైంది.

స్వచ్ఛభారత్ కార్మికులకు అన్యాయం

సర్పంచి,కార్యదర్శి మధ్య నెలకొన్న కోల్డ్‌వార్‌తో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు చెల్లించలేక పోతున్నామని చేతులెత్తేసి పొమ్మనకుండా పొగపెట్టారు. దీంతో నలుగురు పనికి దూరం అయ్యారు. మరో వైపు వైతనాలు ఇవ్వలేక 12 మంది స్వచ్ఛ భారత్ కార్మికులను తొలిగించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 8 మంది పని చేస్తున్నా వారిలో నలుగురు రావడం లేదని తెలుస్తోంది. వీరికి సబ్బు, నూనె ఇచ్చినా బిల్లులుకార్యదర్శి చెల్లించలేదని సర్పంచి మామ నరసింహప్ప తెలిపారు. ఈ నేపథ్యంలో పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వాటర్ ట్యాంక్‌లకు బ్లీచింగ్ చేయక పోవడంతో ట్యాంక్‌లలో పాచిపేరుకుపోయింది.

సమస్యలు దృష్టికి వచ్చినా పట్టించుకోరు

ప్రజలు అనేక సమస్యలు మా దృష్టికి తీసుకొస్తున్నారు. అయితే మేము ఆ సమస్యలను కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదు. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాము. కార్యదర్శి కార్యాలయానికి సమయానికి రావటం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందాయి. ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించాము. కార్యదర్శిపై వారు చర్యలు తీసుకొని పంచాయతీ అభివృద్ధి కి తోడ్పడాలి.

సంధ్య,
చిలమత్తూరు సర్పంచి

బిల్లులు చెల్లించలేదనడం అసత్యం

నేను చిలమత్తూరు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకునే సమయంలో 15 వ ఆర్థిక సంఘం నిధులు కేవలం రూ. 9 లక్షలే ఉన్నాయి. సాధారణ నిధులు కూడా సరిగా వసూలు కావడం లేదు. ఇది మేజర్ పంచాయతీ. తిరిగి నిధులు వచ్చే వరకు వీటినే వాడుకోవాలనే ఉద్దేశ్యంతో అత్యవసరమున్న వాటికే ప్రాధాన్యత ఇచ్చాము. ఇప్పటికే నిధులు సున్నా అయ్యాయి. ఇక రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తితే నిధులు లేక పోతే ఎలా పరిష్కరించాలి

మధుసుధన్,
చిలమత్తూరు కార్యదర్శి

పండ్ల తోటల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి

ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకం గత పది సంవత్సరాల నుండి అభివృద్ధి చెందింది. పండ్లతోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపి విరివిగా సాగు చేస్తున్నారు. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు సంవత్సరాల నుండి జిల్లాలో వర్షాలు కురుస్తుందన రైతులు పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. దానికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి?


జవాబు: అతివృష్టి అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. మొదటి దశలో గుంతలు తీయడానికి మొక్కలు నాటడానికి మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తున్నాము. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు పండ్ల తోటల పెంపకం పై మక్కువ చూపుతున్నారు.

ప్ర : పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వము ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది ?

జ : పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది. బోరు బావులు త్రవ్వకం రైతులకు డ్రైలాండ్ హార్టికల్చర్ పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి, ఎరువులు తదితర వాటి కోసం మూడేళ్లకు ఎకరాకు రూ.1, 03,193 రాయితీ అందిస్తుంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే రూ.1,07, 459 రాయితీ అందిస్తోంది. జామ ,సపోటా, కొబ్బరి ,సీతాఫలం, తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు విరివిగా ప్రభుత్వం అందిస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్ర : పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?

జ: సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంట నష్టం జరిగింది. అత్యధికంగా కాయగూరల పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది .జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం



బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు, అరటికి రూ.25 వేలు, మామిడికి ఎకరాకు రూ.20, వేలు, నారింజ, దానిమ్మ, కాయగూరలు పంటలకు రూ. 15వేలు, కొత్తిమీర పంటకు రూ.7,200 నష్టపరిహారం రైతులకు అందించాం.

ప్ర : పండ్ల తోటల నష్ట నివారణ చర్యలేవి?

జ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సత్యసాయి జిల్లాలో ఉద్యానవన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలతో పాటు కాయగూరలు, పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రాథమిక అంచనా ప్రకారం పంట నష్ట నివేదికను తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జిల్లాలో 33శాతం పంట నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు పంపాం. గత సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్ట పరిహారం అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపి, నష్టపరిహారం కూడా అందజేశాం.



ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారు?

జ : పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుండి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలను ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. దాని ప్రకారం ఇంకా రావాల్సిన వారికి త్వరలో నష్టపరిహారం అందజేయనున్నాం. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు ,పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.

'ఎల్‌ఎం'కు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

వైసిపి యువనాయకుడు ఎల్‌ఎం. విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి యువనాయుడు ఎల్‌ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి

రాబోవు 2024 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే సీటు వైసిపి సీనియర్ నాయకుడు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డికి కేటాయించాలని, వైసిపి యువ నాయకుడు ఎల్‌ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సీటు తన తండ్రి మోహన్‌రెడ్డి ఇస్తే గెలిపించి సిఎం జగన్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. మోహన్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి వీరభిమానిగా ఉండి ఆ కుటుంబ విధేయుడిగా పని చేశారన్నారు. 2004, 2009 ఎన్నికల్లో గెంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ప్రజల మన్నలను పొందిందన్నారు. మోహన్‌రెడ్డి తన దైన పాత్ర పోషించి పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ నియమించిన అభ్యర్థులను గెలుపు కోసం కృషి చేశారన్నారు. ప్రతిపక్ష టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పరిటాల రవీంద్ర ప్రభావం జిల్లాలో ఉన్న నేపథ్యంలో కూడా మోహన్‌రెడ్డి జడ్పీటీసీ, ఎంపిటిసి అభ్యర్థులను గెలిపించుకున్నారని గుర్తు చేశారు. అంతేగాకుండా వైఎస్ఆర్ కుటుంబంతోనే నడిచారని తెలిపారు. వైఎస్ఆర్ మరణాంతరం జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచి వైసిపి బలోపేతం కోసం పని చేశారన్నారు. కుల సమీకరణాల నేపథ్యంలో కళ్యాణదుర్గం, మడికశిర నియోజకవర్గాల్లో సీటు ఇతరులకు కేటాయించారని, జగన్ ఆదేశాలతో వారి గెలుపునకు కృషి చేశారన్నారు. జగన్ ముఖ్యమంత్రి కావాలని దీక్షలు, రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో కళ్యాణదుర్గం సీటు మోహన్‌రెడ్డికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి రాష్ట్ర సీనియర్ నాయుడు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 175 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అధినేత దృష్టి సారించారని, అందులో భాగంగా సిట్టింగ్ స్థానాల్లో కొందరిని మార్పులు చేస్తున్నారని తెలిపారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సీటు నతకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కుల సమీకరణాలు జరిగి స్థానం మార్చాలన్నా జిల్లాలో ఏ నియోజకవర్గం ఇచ్చినా గెలుపొంది సిఎంకు బహుమతిగా ఇస్తామన్నారు.

వికలాంగులకు జీవనోపాధి కల్పించాలి

పామిడి : వికలాంగుల జీవనోపాధికి నిధులు కేటాయించాలని విశాల ఫ్రెరర్ వికలాంగుల మండల సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫారెస్టు బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సొంత ఉపాధి పనుల కోసం ఎన్ఎస్ఎఫ్ డిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన నిధులను వెనక్కి పంపడం చాలా దురదృష్టకరమన్నారు. వెంటనే అడ్డంకులను తొలగించి వికలాంగులు సొంతంగా జీవనోపాధి పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాల ఫ్రెరర్ మండల అధ్యక్షుడు కేశవాచారి, సెక్రటరీ సర్వేష్, సంఘం నాయకులు శివన్న, బందే సాబ్, నరసింహులు, ఓబులపతి, సుధాకర్‌రెడ్డి, కుమ్మరి సుధాకర్, రహంతుల్లా, అప్పన్నగారి కుమార్, వంకరాజు కాలువ నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ ఎస్ఐగా ఆంజనేయులు



బొమ్మనహాల్ : మండల ఎస్ఐగా వై.ఆంజనేయులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేకంగా పని చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా పేకాట, మట్కా, జూదం వంటివాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అనంతరం కురుమ సంఘం మండల కన్వీనర్ పరమేశ్వర, వాల్మీకి సంఘం నాయకులు, వైసిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'అనంత'లో అనసూయ సందడి

'మగువ ఫ్యాషన్ మాల్'ను ప్రారంభించిన సినీనటి - మేనేజింగ్ డైరెక్టర్ గోకుల్ రవికి అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాకేంద్రంలో సినీనటి అనసూయ భరద్వాజ్ ఆదివారం సందడి చేశారు. స్థానిక సుభాష్ రోడ్డులోని రాజేంద్ర ఏజెన్సీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన 'మగువ ఫ్యాషన్ మాల్'ను అనసూయ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా ప్రజలు తనను ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. జీవితాంతం అభిమానులకు రుణపడి ఉంటానన్నారు. జిల్లాకేంద్రంలో గోకుల్ రవి మగువ షోరూంను ఏర్పాటు చేసి అతి తక్కువ ధరలలో వస్త్రాలను అందించడం అభినందనీయమన్నారు. సుదీర్ఘకాలంగా వస్త్ర ప్రపంచంలో నమ్మకమైన సేవలను అందిస్తూ ప్రజాధరణ పొందుతున్నారన్నారు. గోకుల్ రవి మాట్లాడుతూ 40 దశాబ్ధాలుగా వస్త్రరంగంలో విశేషమైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రస్తుతం 14 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరంతస్తుల్లో మగువ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. పిల్లల నుండి పెద్దలు, మహిళలు, పురుషులకు అన్నిరకాల మోడల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రధానంగా మ్యారేజ్ బ్రైడల్ శారీలు, గాగ్రాలు, లెహంగాలు, రెడీమేడ్ డ్రస్సులు, కిడ్స్‌వేర్, మెన్స్ వేర్, పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలను సాధారణ ధరలకు నాణ్యత అందిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఆశీర్వదిస్తే భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లను మీ ముందుకు తీసుకొస్తామన్నారు. కాగా ప్రారంభోత్సవం సందర్భంగా కేవలం రూ.49కే చీరలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో గోకుల్ చైతన్య గోకుల్ రవి కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.





మగువ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి అనుసూయ, చీరలను పరిశీలిస్తున్న సినీనటి

విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించాలి

చిన్నపిల్లల వైద్యులు హరిప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు చిన్నప్పటి నుంచే బాగా చదువుకుని జీవితంలో ఉన్న ఆశయాలను సాధించాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం ద్వారకానగర్‌లోని నారాయణ హైస్కూల్‌లో విద్యార్థులకు నెలవారీ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్ర కో కన్వీనర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలోకన్వీనర్ ఏజి.రాజమోహన్ అవగాహన కల్పించారు. ఈ పోటీలకు నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హస్మా, డాక్టర్ హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, రిడ్, రైట్ పోటీలను నిర్వహించారు. ఆటలు, జాతీయ జెండా, ఉపాధ్యాయుడు, ఉజ్వల భవిష్యత్తు వంటి అంశాలపై వారిలో ఆత్మవిశ్వాసం పెంచడానికి అక్కడికక్కడే నిర్వహించబడిన పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటలు, పోటీ పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అలవర్చుకోవాలన్నారు. నెలవారి పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృతనాత్మకత పెంపొందిస్తున్న విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్ర కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ముత్యాలు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, విరూపాక్ష, ధనుంజయ, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు చంద్ర, లక్ష్మన్, రాము, ఆంజనేయులు, ఎంఎన్‌టి.రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న చిన్నపిల్లల వైద్యులు హరిప్రసాద్

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లలిత కళాపరిషత్‌లో అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెన్షనర్ల పితామహులు డిఎస్.నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు సి.పెద్దన్న గౌడ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి నెల మొదటి వారంలో పెన్షన్ రాకపోవడం వల్ల పెన్షనర్స్ చాలా ఇబ్బందులు ఎదురుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 185 నెలల డిఆర్ బకాయిలు, 11వ పిఆర్‌సి బకాయిలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పెన్షనర్‌లను ఇబ్బందికి గురి చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరళా విజయకుమారి, ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాలంకి సుబ్బరాయన్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రిటైర్డ్ డిఆర్‌ఓ ఎస్.రఘునాథ్, పెన్షనర్ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు కలందర్, రామకష్ణ, ప్రభాకర్, డేనియల్ ప్రభాకర్, మహమ్మద్, తిప్పన్న, నారాయణ, క్రిష్టప్ప, జయరాం, పుల్లప్ప, నారాయణ స్వామి, సత్యనారాయణ, సూర్యనారాయణ, అనంతయ్య, సావిత్రి దేవి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అనంతపురం : పెన్షనర్స్ దినోత్సవాన్ని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 75 సంవత్సరాలు నిండిన 10 మంది సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. తర్వాత పెన్షనర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తర్వాత మీనాక్షిమ్మ సమ్మళిత వికాస్ కేంద్రం వద్ద అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.ముజిబ్‌షాషా, డిజిఎం సిఒ బాలగంగాధర్‌రెడ్డి, వైద్యనిపుణులు అక్బర్‌సాహెబ్, అల్ ఇండియా సహాయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఎసిఎస్ సుభాన్, బ్రాంచి సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, బాల రంగయ్య, ఓ.బాబయ్య, ప్రకాష్, బి.బాబు, వై.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని ఏపి రాష్ట్ర పెన్షనర్ల భవన్‌లో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని సంఘం మండల అధ్యక్షులు కె.అబూబకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు రావడానికి కృషిచేసిన డిఎస్. నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత 70 ఏళ్లు నిండిన 15మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలోఉప ఖజానాధికారి డి.సురేష్ బాబు, మాతృశ్రీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, కోశాధికారి ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పెన్షనర్లు తమ శేష జీవితాన్ని ప్రశాంతంగా సాగించాలని ప్రముఖ వైద్యులు ఆత్మకూరు గోపాలరావు ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ పింఛనర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గౌరా సత్యనారాయణ, సభ్యులు ముత్యాలరెడ్డి, గంగాధర్, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు



అనంతపురంలో సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బుక్కరాయసముద్రం : కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారిణి శ్రీదేవి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గోవిందంపల్లి, ఆర్.కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపిడిఒ తేజోష్ణ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించేందుకు అన్ని పంచాయతీల్లో ఈ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికసిత సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, డ్రోన్ పైలెట్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి పూర్వవైభవం తెద్దాం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు

ప్రజాశక్తి-కుందుర్పి

మరో మూడు నెలల్లో రానున్న సాధారన ఎన్నికల్లో వైసిపిని చిత్తుచిత్తుగా ఓడిద్దామని నియోజవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చసిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు నెలల తర్వాత రాబోయే ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి టిడిపి అభ్యర్థిని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసిపి దొంగ నాయకులను ఓటుతో ఓడించి ఇళ్లకు సాగనంపాలని పిలుపునిచ్చారు. భూ రీసర్వే పేరుతో సామాన్య రైతుల భూమిని తగ్గించి వైసిపి నాయకులకు అందించడం దారుణమన్నారు. వైసిపి నాయకులు టిడిపి సానుభూతిపరులకు సంబంధించిన రేషన్ కార్డులు, పెన్షన్లు తొలగించడం, ఇల్లు తీసివేయడం వంటి కార్యక్రమాలకు పాల్పడటం బాధాకరమన్నారు. మూడు నెలల తర్వాత టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అలాగే ప్రతి పంచాయతీలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, పట్టణ కన్వీనర్ రంగనాథ్, మాజీ వైస్ ఎంపీపీ రవి, మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, ములకలేడు ఎంపిటిసి లింగప్ప, ఎర్రగుంట ఆనంద్, మాజీ సర్పంచి శివలింగప్ప, ఐదు మండలాల కన్వీనర్లు, వందలాది మంది నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు

ఘనంగా కనకదాస జయంతి



పూజలందుకున్న కనకదాస విగ్రహం

గార్లదిన్నె : కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కనకదాస విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో కురబ కులస్తులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కనకదాసు స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ బోలె పాండు, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ఈశ్వరయ్య, ఎంపిటిసి రామచంద్ర, సప్లయర్స్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

పుట్లూరు : మండలంలోని మడుగుపల్లి, చాలవేముల గ్రామాల్లో సోమవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, మండల, పంచాయతీల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బోరుబావి తవ్వకం

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక లక్ష్మీనరసింహ కాలనీ మసీదు వెనుక రూ.1.20 లక్షలతో వేస్తున్న బోరుకు సర్పంచి లలిత ఆదివారం పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బోర్‌వెల్ సిస్టం ట్యాంకులు 80 వరకూ ఏర్పాటు చేశామని వివరించారు. ఇంకా ఎక్కడ అవసరమైతే సిస్టం ట్యాంకులు నిర్మిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వార్డు సభ్యుడు ముష్కిన్ సాబ్, నాయకులు జోగి భీమప్ప, హనుమంతు, జిలాన్, స్కూల్ కమిటీ ఛైర్మన్ శర్మస్, డీలర్ శర్మస్, మొయినుద్దీన్, రామకృష్ణ, అరె రాజ, తాజు, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.



బోర్‌వెల్‌కు పూజ చేస్తున్న సర్పంచి లలిత

పూర్వవిద్యార్థుల కలయిక

గుత్తి : మాల్టస్ స్మిత్ హైస్కూలులో 1980-81 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠవాలలో కలుసుకున్నారు. అందరూ ఒకే వేదికపైన కలుసుకుని ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారో తెలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఎం.ఎస్ ఉన్నత పాఠశాల పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు.

పేదల ఇళ్లస్థలాల కబ్జా అన్యాయం

అనంతపురం కలెక్టరేట్ : రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా నుంచి దళిత, గిరిజనుల ఇళ్ల స్థలాలు కాపాడాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పేదలకు మద్దతు జిల్లా పరిషత్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి దళిత సంఘాల నేతలు కెపి.నారాయణసామి, బేకరి గంగాధర్, పెద్దపప్పురు ఆది తదితరులు తరులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం, కురుకుంట సర్వే నెంబర్ 41-1, 41-3, 41-3 లో దళిత, గిరిజనులకు 2010లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఉన్న ఫలంగా ఆ భూములు మావంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదలు వేసుకున్న బండలు తొలగించి భూమికి కంచే వేసి ఆక్రమిస్తున్నారని తెలిపారు. కబ్జాలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించాలన్నారు. పేదల ప్రభుత్వంలో ఇలాంటి కబ్జాలు ఆపాలని కోరారు. లేని పక్షంలో పేదలు కడుపు మంటకు అధికారం దూరం చేస్తారని హెచ్చరించారు.

టిడిపిలో పలువురు చేరిక

గుత్తి : పట్టణంలోని గాంధీనగర్‌కి చెందిన పలు కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరాయి. మున్సిపాలిటీ పరిధిలోని 22వవార్డులో టిడిపి ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ సమక్షంలో పలువురు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి నాయకులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్ మాట్లాడుతూ నారా చంద్రబాబుతోనే రాష్ట్ర అభివద్ధి జరుగుతుందన్నారు. వైసిపి పాలనకు ప్రజలు చమరగీతం పాడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి సీఎంగా చంద్రబాబును చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరేంద్రచౌదరి, అన్వర్, కేఎల్ శీనా, మాజీ సర్పంచి సుంకన్న, తెలుగు యువత నాయకులు కరిడికొండ సుధాకర్‌నాయుడు, వెంకటేష్ శివుడు, రాముయాదవ్, ఖాజా, ఎస్. బషీర్,దాదా ఖలందర్, జాఫర్ పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న టిడిపి నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

వైసిపి ఐటీ విభాగం నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

2024 ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైసిపి ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కళాశాలలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూడా జిల్లాలో ఐటీ విభాగం ఇంటింటి ప్రచారం ర్యాలీలు నిర్వహించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కొత్తగా ప్రకటించిన జిల్లా విభాగంతో కలిసి ప్రచారం చేస్తామన్నారు. సోషియల్ మీడియా డిజిటల్ విభాగాల్లో పార్టీకి అండగా ఐటీ విభాగం కొనసాగుతుందన్నారు. బెంగళూరు వేదికగా సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా 'అడుదాం బెంగళూరు'ని జయప్రదం చేయాలని కోరారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ విభాగం రిజినల్ కో ఆర్డినేటర్లు మంజునాథ్, సుధీర్‌రెడ్డి, యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు రగునాథ్‌రెడ్డి, సాయిశరన్, చంద్రమోహన్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, సుబ్బు రాయల్, అలీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి ఐటి విభాగం నాయకులు

'కిండర్‌టౌన్'కు ప్రీస్కూల్స్ ఆఫ్ ఇండియా అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామ్‌నగర్‌లోని కిండర్ టౌన్ పాఠశాలకు 'బ్రెయిన్‌ఫీడ్ టాప్-100 ప్రీస్కూల్స్ ఆఫ్ ఇండియా' అవార్డు అందుకుంది. ఇది ఆసియాలోనే అతిపెద్ద నాయకులు, విద్యావేత్తలు, విద్యారంగానికి చెందిన నిపుణుల సమావేశంలో గుర్తింపును అందిస్తారు. డిసెంబర్ 16న తెలంగాణ రాష్ట్రంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉన్న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన గ్రాండ్ బ్రెయిన్‌ఫీడ్ టాప్ ప్రీస్కూల్స్ ఆఫ్ ఇండియా అవార్డ్స్ రిసెప్షన్ వేడుకలో పాఠశాల కరస్పాండెంట్ జైనాబ్ నూర్ అవార్డు అందుకున్నారు. దీనికితోడు అదనంగా, కిండర్‌టౌన్ ఇటి టెక్ ఎక్స్ 2023లో బ్రెయిన్ ఫీడ్ ద్వారా ఆధారితమైన ఫౌండేషన్ ఇయర్స్ కాన్ఫరెన్స్‌లో కూడా భాగంగా ఉంది. ఈ సమావేశం ఇసిసిఇ అవసరాలు, వ్యూహాలను అభివృద్ధి చేయడంపై సంభాషణను కలిగి ఉండటానికి ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యా స్థలం నుంచి ప్రముఖ విద్యావేత్తలు, నిపుణులు, సంస్థలు, వినూత్నమైన ఉత్పత్తి, సేవల కంపెనీలు తీసుకొస్తుందని ఆమె అన్నారు. భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులను వ్యక్తిత్వ వికాస శిక్షణలను జీవిస్తామని వివరించారు.



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ జైనాబ్ నూర్

నార్పలలో జూడో లీగ్ పోటీలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఆర్‌డిటి సహకారంతో బాల,బాలికలకు ఆదివారం జూడో లీగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీనియర్ క్రీడాకారుడు తుపాకుల భాస్కర్, బ్యాడ్మింటన్ కోచ్, ఇండోర్ స్టేడియం జూడో కోచ్ రమేష్ శివమ్మ ప్రారంభించారు. అనంతరం విజేతలకు నార్పల సర్పంచి మనీలా సుప్రియ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. పోటీల్లో బాలికల విభాగంలో హర్షిత, ప్రణవి, నాగరత్న, వందన, భవిత, కీర్తన, మంజుల, సబితా, శాంతాజ్, ఆయిషా, బాలుర విభాగంలో శ్రీకాంత్, గౌతమ్, నరేష్, రమేష్, శశాంక్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంజెకె గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు కవిత, లావణ్య, కెఎన్.బాబు, జూడో సంఘం ప్రతాప్, సత్యసాయి జిల్లా జూడో కోచ్ రెడ్డప్పరెడ్డి, స్థానిక క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



నార్పల ఇండోర్ స్టేడియంలో జూడో పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

సుబ్రమణ్యస్వామికి పాలాభిషేకం

ఉరవకొండ : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో స్వయంభువుగా వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం 108 లీటర్ల పాలతో శత రుద్రాభిషేకం చేశారు. అనంతరం నవగ్రహ పరస్పర రుద్ర స్వాహాకరం, మహామంగళహారతి వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం లగ్నపత్రిక, దీక్షాహవనం, నాగమండలారాధ, కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎంసి కరిబసి, సభ్యులు శంకరయ్య, వేమన్న, సుబ్బలక్ష్మి, ఆలయ ఇఒ అంగదాల కృష్ణయ్య, అర్చకులు దివాకరశర్మ, నాగరాజుశర్మ, అర్చక బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిటీ సభ్యులు

పుట్లూరు : వైసీపీ అనుబంధ సంస్థల కమిటీలో ఎంపికైన పలువురు సిఎం జగన్‌తోపాటు ఎమ్మెల్యే దంపతులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తక్కల్లపల్లి సర్పంచి మహేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర యువజన కార్యదర్శిగా, రంగరాజుకుంట సర్పంచి బి.రామంజులరెడ్డికి జిల్లా యువజన ఉపాధ్యక్షులుగా, చెర్లోపల్లి దినేష్‌రెడ్డికి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా, కందికాపుల గ్రామానికి చెందిన అంకిరెడ్డి శ్రీధర్‌రెడ్డికి కల్చర్ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఆయా కమిటీ సభ్యులు ఆదివారం అనంతపురంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు.

నేరాలు ఘోరాలు

యువకుడు గల్లంతు

గార్లదిన్నె : మండలంలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్‌లో ఉరవకొండకు చెందిన ఆర్యన్ (19) ఆదివారం తెప్ప తిరగబడడంతో నీటిలో పడి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండకు చెందిన ఐదుగురు యువకులు జలాశయం వద్దకు విహారయాత్రకు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో మద్యం తాగి భోజనానంతరం డ్యామ్‌లో ఉన్న చేపల పట్టే తెప్పలో ప్రయాణం చేస్తుండగా అదుపుతప్పి తిరగబడింది. దీంతో యువకులు నీటిలో పడిపోయారు. వీరిలో నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరగా ఆర్యన్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

గార్లదిన్నె : మండల పరిధిలోని కొప్పలకొండ గ్రామంలో ఆదివారం గడ్డివామికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు హరిజన వన్నూరప్ప వివరాల మేరకు... తను సభ్యులతో కలిసి పొలం పనికి వెళ్లడంతో కళ్లం దొడ్డి దగ్గర పిల్లలు ఆడుకుంటూ గడ్డివామికి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలు ఆర్పేలోపు పూర్తిగా కాలిపోయిందని వాపోయారు. దీంతో సుమారు రూ.60వేల వరకూ నష్టం జరిగి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.